# నీడ

- ఓ. సుజాతా దేవి

ఆ ఇంటి మెట్లెక్కుతుంటే అంత చలి ఉదయంలోనూ చిరు చెమట కమ్మింది. ఏదో గుబులు గుండె నిండా ఆక్రమించింది. మెట్లన్నీ ఎక్కి మూల పిట్టగోడను ఆనుకొని అలుపు తీర్చుకున్నాను. బాల్కనీలోకంటూ వాలిన వేప చెట్టు కొమ్మల మీద నుంచి చల్లగా సువాసన నిండిన గాలి వీస్తోంది. ఇవతలి భాగంలోంచి ఏదో కూనిరాగం మొదలై పాటగా మారి వినబడుతోంది.

ఏమీ సూసీ వలసీ నావో నా రంగ
ఏమీ సేసీ గెలిసీ నావో నారాజ
గల్లు గల్లను లచిమి నొదిలీ నారంగ
వల్ల కాటికి చేరినావా నా రాజ
మేడ మిద్దెలు రోసినావా నా రంగ
పూరిగుడిసెలు బెమసినావా నారాజ

విలక్షణమైన స్వరంతో విచిత్రంగా వున్న ఆ పాట వింటూ తలుపు తట్టాను.

"ఎవరు? ఎవరు?"

అని పిల్లల అరుపులు లోపల నుంచి.

"నేను తీస్తా తలుపు నేనే తీస్తా" నేనంటే నేనే అని ఒంతుల గొంతులు.

పని మనిషని పందెం!
కాదని పందెం
ఔనని
కాదని

"కాదు.. ఔను పందెం.. పందెం" అని వాదులాడుకుంటూ తలుపు తీశారు.

"అదిగో.. అత్తే నేను చెప్పానా? మూడు గుద్దులు పట్టు" అని చిన్నీ వెనకే పరుగెత్తింది బుజ్జి.

"నీకెలా తెలుసు?"

"పనిమనిషైతే ఈ పాటికి తలుపు పగల గొట్టేదిగా!"

వాళ్ళ పందాలకు నవ్వుకుంటూ" తలుపు తీయ్ బుజ్జీ! నేను"అన్నాను.

" హాయ్.. అత్త... అత్తొచ్చింది"

పక్కభాగంలోంచి ఇంకా పాట వినిపిస్తోంది. ఆ పాటలో క్రమంగా అనుభూతి గాఢమై శోకచ్ఛాయ పరచుకొంటోంది. "ఏమిటక్కా అలా నిలబడి పోయావ్? రా!" అంటూ వచ్చింది ప్రసన్న.

"ఏమిటి తల్లీ ఈ పాటలు. పక్క వాటాలో కెవరైనా కొత్త వాళ్ళొచ్చారా?"అన్నాన్నేను.

"ఆ! రంగనాథ్‌గారని దంత వైద్యుడు"

"ఆవిడలా పాడుతూ వుంటేదంత వైద్యమేమో గాని చెవులు పాడవుతాయ్ జాగ్రత్త" అంటుంటే " సరే ముఖం కడుక్కో కాఫీ కలుపుతాను" అంటూ లోపలికి దారి తీసింది.


"చంద్రుడేడీ?" అన్నాన్నేను గదిలోకి తొంగి చూసి.


" మద్రాసు నుంచి ఫ్రెండ్సొచ్చారని నిన్న పొద్దునగా వెళ్ళాడు. ఇంత వరకూ అజా అయివూ లేదు. కొంప ఏమైపోయినా పరవాలేదు. ఇలాంటి వాళ్ళకసలూ" అంటూ ఆగిపోయింది. ప్రసన్న" సరే సరే నువ్వు బ్రష్‌చేసుకురా, కాఫీ తాగుదువుగాని" అంది.

" నేను వస్తున్న విషయం చెంద్రుడు చెప్పలేదన్న మాట" అసలా విషయమేమైనా ఆలోచించాడో లేదో. .! ఆలోచిస్తే ప్రసన్నతో అనకుండా వుంటాడా! రహస్యంగా వుంచమని నేనేం అనలేదే, అంటే నేను జీవన్మరణ సమస్యగా ఎంచిన విషయం చెంద్రుడసలు పట్టించుకోనే లేదనుకోవాలా! ఏమో వచ్చి ఎంత సేపయిందనీ అని నాకు నేనే సర్దుకున్నాను.

"బలే సమయానికి వచ్చావులే. ఇవాళా రేపు సెలవు పడేశా" అంటూ కాఫీ తెచ్చి ఇచ్చింది ప్రసన్న.

"అయితే విశేషమే. ఎందుకు పెట్టావ్? ముఖ్యమైన మైన విషయం ఇవాళ కొత్త పంచదార కార్డులు ఇచ్చేవాళ్ళు వస్తారు. ఇంటి దగ్గరుండాలి. మధ్యాహ్నం అన్నయ్య వాళ్ళింటికే లంచ్‌కి





వెళ్ళాలి. నాలుగింటికి పిల్లల స్కూల్‌లో టీచర్స్‌తో ముఖాముఖీ – అన్నింటి మధ్య నీతో బాతాఖానీ"

"అన్నీ నువ్వే చూసుకోవాలా?" అని ప్రసన్నను ప్రశ్నించలేదు. ఆమె సమాధానం నాకుతెలుసు. పెళ్ళై పదేళ్ళయినా చంద్రుడు మారలేదు. ఇక మారడు. ఇంతకు ముందు కంటికి కనబడగానే కంప్లయింట్ ఇచ్చే ప్రసన్న విసిగి పోయిందో, అల వాటు పడిపోయిందో "అన్నింటికీ నేనే చావాలి. నాకే పట్టింది కొంప. అతనో గౌరవనీయ అతిథి" అని అనలేదు. అరవలేదు. కోపం తెచ్చుకోలేదు. కళ్ళు నింపుకోలేదు.

"అన్నయ్య వాళ్ళ సంగతులేమిటి?"అంటూమాట మార్చాను నేను.

"వదినా... ఇది కుదిరిందేమో చూడు" అని వచ్చిందో కావిడ.

నడినెత్తికి ఎత్తిచుట్టిన సిగ వదిలి వేళ్ళాడుతున్న జాజి దండ నల్లటి ముఖంలో దిబ్బముక్కుకు రాళ్ళదేసరి..

పుల్లలాటి పొట్టి మనిషి బల్ల కొయ్యకు తగిలించినట్లు నైటీ వొదులుగా వేళ్ళాడుతోంది. ఆవిడ వొంటి మీద ఆవిడ చేతిలోని గ్లాసులో రంగుల మిశ్రమ పదార్థమేమిటో వుంది.

"ఏమిటిదీ.. మళ్ళీ ఏంతయారు చేశావ్ మా ప్రాణానికి?"రవ్వకేసరి నిన్న నువ్వు చెప్పినట్లే చేశా.. కొంచెం రవ్వ మాడింది. పాకం ముదిరింది. రంగు ఎక్కువ బడింది. అంతే,'' అంది హుషారుగ. నుట్టాలొచ్చిన్రా.. ఆరికి పెట్టమాకలే...'' అంది సిగ్గుగా"

"చుట్టాలు కాదులే మహారాజశ్రీ మీ అన్నగారికి ప్రియమైన అక్క" అంది ప్రసన్న.

"నమస్తే అక్కయ్యా" అందామె చేతులుజోడించి.

"ఈమె రాజమ్మక్కా – పక్క ఇంట్లోని డాక్టర్ రంగనాథ్ గారి భార్య"

"అన్నకి అక్కయ్య నాకు అక్కయ్యగాని నీకెట్లవుద్ది? నువ్వట్ల పిలవ పనిలే"అని ప్రసన్నతో వాదుకు దిగింది రాజమ్మ, నమస్కారం అందుకోకుండానే..

" సరేలే చిన్నప్పటి నుంచీ వున్న అలవాటు. ఇవాళ నువ్వ చెపితే పోద్దా చెల్లెలు చంద్రక్కా" అంది ప్రసన్న.

"ఆ.. అట్లానా.. ఆ అక్కయ్య తమ్మునితో కాపరమెట్లా చేత్తన్నావ్ వగలమారి వదినా' అని ప్రసన్న బుగ్గ పొడిచింది.

## కులాల వ్యాకులాల కతీతంగా...

1935 నుండి 1955 వరకూ సుమారు రెండు దశాబ్దాల కాలం సమస్త ఆంధ్ర దేశాన్ని తన గజ్జెల రవళితో సమ్మోహన మొనర్చి 'మొక్క జొన్న తోటలో', 'గుత్తి వంకాయ కూర', 'ఓహో వసంతా', 'ఎంకి వంటి పిల్ల' లాంటి ఎన్నో భావ గీతాలకు మధుర మంజులమైన హావ భావాలతో నాట్య విన్యాసాలతో రూప కల్పన చేసి యావదాంధ్రాన్నీ రస స్నిగ్ధం చేసిన బాల బంధు బి.వి. నరసింహారావుగారు తెలుగు వారికి సుపరిచితులు. కృష్ణశాస్త్రిగారికి మేనల్లుడుగా, సీతా అనసూయలకు సోదరుడుగా, విశ్వనాథ, వేదుల, నండూరి, చలం వంటి ఎందరో ప్రసిద్ధులైన సాహితీ వేత్తలకి పరిచయం అయినా, నిజానికి బి.వి. నరిసింహారావుది 'ఏ కులం?' అని చాలా మందికి అనుమానంగా వుండేది. అయితే సూటిగా అడగడం మర్యాదకాదు కనుక కొందరు ఊరుకునేవారు.

కొందరైతే 'మనవాడేనా' అని అడిగేవారు ప్రక్క వారిని.
బి.వి.కి వళ్ళు మంటగా వుండేది.




కులం ప్రసక్తి ఆయనకి సుతారమూ కిట్టేది కాదు. ఆ ప్రసక్తి వస్తే "ఆ...మీవాణ్ణే" అనో, "మేనమామది ఒక కులం అయితే మేనల్లుడిది మరో కులం అవుతుందా?" అనో కొంటెగా సమాధానం చెప్పేవారేకాని, ఏ కులమో అంతు చిక్కనిచ్చేవారు కాదు.

ఓ మారు చాలా మంది సాహితీ వేత్తల మధ్య వుండగా మళ్ళీ ఆ ప్రశ్న తలెత్తింది. ఒకాయన అడగనే అడిగాడు "మీదేకులం?" అని దాంతో బి.వి. "మాదాండీ? వ్యాకులం లేని కులం, బాల కులం" అన్నారు. తను వ్రాసిన బాల గేయాల సంపుటి చూపిస్తూ ఆయన సమయస్ఫూర్తికి అంతా సంతోషించారు.

పోలాప్రగడ

నడుం చుట్టూ చేయివేసి కితకితలు పెట్టింది రాజమ్మ.

వాళ్ళిద్దరూ విరగబడి నవ్వుతుంటే విధిలేనట్టు నవ్వానేగాని ఆ హాస్యం వెగటుగా అనిపించింది నాకు. ఎవరితోనైనా గిరిలో వుండి మాట్లాడే ప్రసన్న ఆ మనిషితో అంత చనువుగా కలిసిపోవడమూ ఆ తరహాని ఆనందించడమూ వింతనిపించింది కూడా.

"అమ్మనే బోతా నా నాథుడేదుస్తాడేమో"అని పరుగెత్తి వెళ్ళిపోయింది రాజమ్మ'

ప్రసన్న పిల్లలను స్కూలుకి పంపే హడావుడిలో పడింది.

మధ్యమధ్యలో నాతో మాట్లాడిన దాన్ని బట్టి నా రాకకు కారణం తనకు తెలియదనే అర్థమయింది.

అంటే చంద్రుడు ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదన్నమాట.

ఇదేంటక్కా.. ఈ సర్టిఫికెట్లన్నీ తెచ్చుకున్నావ్. ఉద్యోగమేమన్నా వచ్చిందా ఏంటి? చిల్లర కోసం నీ బాగ్ తీస్తేనూ..."

జవాబు కోసం నా ముఖంలోకి చూస్తోంది ప్రసన్న.

"ఆ... ఉద్యోగం వస్తే చేయాలనే.. వస్తుందంటావా?" యాదాలాపంగా అనాలనుకున్నా నా ప్రయత్నం ఫలించలేదు.

"నీకేం ఖర్మ.. మీ ఆయన రెండు చేతులా సంపాదిస్తోంటే"

"నిజమే సంపాదన రెండు చేతుల్లా వుంది.మనసే నామీద లేదట"

"చాల్లేద్దూ జోకులు మీదో ఆదర్శ దాంపత్యమని మీ తమ్ముడు అంటూంటాడు!" నవ్వేస్తూ అంది ప్రసన్న.

నేనేం మాట్లాడలేదు. నా మేడిపండు జీవితం మెరుస్తూ అందరికీ అటువంటి భ్రమనే కలగజేస్తోందని నాకు తెలిసిన విషయమే.

ఎప్పుడూ ఎవరి ముందూ కన్నీళ్ళుపెట్టి ఎరగని నా ఇబ్బంది లక్ష్య పెట్టకుండా పొంగివచ్చే దుఃఖ తరంగంలా నన్నాపి వేస్తోంది. వుక్కిలింతలౌతున్న దుఃఖాన్ని పొడి దగ్గుతో సంభాళించుకుంటూ... చెంగుతో ముఖం తుడుచుకుంటూపక్కగదిలోకి వచ్చేశాను.

"బోడి మనసు. నా మనసు గురించి ఆలోచించే తీరికే లేక గానుగెద్దులా ఈడ్చి అవతల పడేస్తున్నాను బతుకు! ఇక అవతల మనిషి మనసెవడిక్కావాలి. అయినా -ఆయన మనసు ఎవరి మీదుంటే ఏంటే. హాయిగా నీక్కావలసింది హక్కుగా డబాయించి లాక్కుని జమాయించి గడిపెయ్యవే"

గోడ వైపు తిరిగి పడుకున్న నా భుజం తడుతూ అంటోంది ప్రసన్న. ఆవిడ స్వరంలోని కరుకు చేతి స్పర్శన లేదు. ఆ స్పర్శలోని సానుభూతినాకు ముళ్ళులా గుచ్చుతోంది.

"పోనీ ప్రసన్నా. తన పాలిటి గుది బండగా,విధిగా తప్పని తద్దినంలా పడితినడం నాకిష్టం లేదు. తనువుకన్నా, మనువుకన్నా,మనసే ముఖ్యం. అదే లేకపోయాక ఏ హక్కుతో ఎలా... ఏమని-"

ప్రసన్న నవ్వింది"అయితే విను. ఆర్థికంగానూ, ఆంతరంగికంగానూ మీ చంద్రుడి వెలుగీ ఇంట్లో, నా మనసులో పడదు. ఆయన జేబుల్లోనూ, మనసులోనూ స్నేహితులకే భాగం.వాళ్ళు ఆడామగా అనేది నా కనవరం.'పళ్ళూడగొట్టటానికి ఏ రాయి అయితేనేం' అనుకుంటాను. అంత పట్టించుకోని మొగుడి మీద నాకూ మనసు లేదు. అయినా మేం కలిసే వుంటున్నాం. వున్నా లేకున్నా ఒకటే అయినప్పుడు పోనీ కలిసే వుందాం అని. అంతే కాదు, నా పిల్లలకు అమ్మా నాన్నా ఇద్దరూ కావాలి. ఏ పిల్లలకైనా అంతే. నీకు చెప్పగలిగేంతటి దాన్ని కాదుగాని.

"ఎవరండీ లోపల,చంద్రకాంత్ గారూ"డాడీ ఇల్లేను అని బయట నుంచెవరో పిలుస్తున్నారు.

"అమ్మో నా రేషన్‌కార్డు" అంటూపరుగెత్తింది ప్రసన్న.

ప్రసన్న అన్నగారిల్లు బంధుమిత్రులతో హడావుడిగా వుంది. వాళ్ళ బాబుకి మెడిసిన్‌లో సీటు వచ్చిన సందర్భంగా పార్టీ. ఆయన వ్యాపారం లాభించింది. ముఖ్యమైన నాలుగు పట్టణాల్లోనూ బ్రాంచీలు వెలసినై.ఇంట్లో వుండడమే అరుదు. వున్న ఒక్క కొడుకూ మెడిసిన్‌కోసం కర్నూలు వెళ్ళిపోతున్నాడు. ఇంద్రభవనం లాంటి ఆ ఇంటిలో ఖరీదైన కార్పెట్లన్నీ అందమైన షోకేసుల్నీ, అక్వేరియంనీ, పూజగదినీ, నగల బీరువాని, సంరక్షించుకుంటూ కదిలే నీడలాగా ఆవిడొక్కతే వుండాలి. ఆయన గారు హడావుడిగా పాతిక మందితో కలిసి వచ్చి ఎడాపెడా భోంచేసి మళ్ళీ వెళ్ళిపోయాడు. తెచ్చిన ఆ వి.ఐ.పి. ఇంట్లో ఇచ్చి సర్ది వుంచిన మరోటి కారులో పెట్టించుకుని, మా అందరితో కలిసి భోం చేస్తున్న భార్యతో "వెళ్తున్నా. అట్నుంచి ఔరంగాబాద్‌వెళ్ళాలి. తరువాత ఫోన్‌చేస్తాలే"అని చెప్పి వెళ్ళిపోయాడు. కాసేపు హాలంతా నిశ్శబ్దం అయిపోయింది.

అప్పడొచ్చింది రాజమ్మ ఉరుకుఉపరుగులుగా.

రాజమ్మకు కూడా వడ్డించింది. ప్రసన్న.

రాజమ్మ ఏమీ తినలేదు. ఏదో ఆలోచిస్తూ అందరినీ పరికించి చూస్తూ వుండిపోయింది.ఇటువంటి వాతావరణం అలవాటున్నట్టు లేదు.

"ఇలాంటమ్మాయిని ఆ (డాక్టరెలా) చేసుకున్నాడు. బహుశా పెద్దవాళ్ళ పోరై వుంటుంది" ప్రసన్నతో చిన్నగా.

"అదేం లేదక్కా, ఇంట్లో వాళ్ళనీ, ఆస్తిలో వాటానీ వదులుకుని అయిదేళ్ళు ఆ అమ్మాయిని బతిమాలుకుని చేసుకున్నాడతను" అంది ప్రసన్న.

నే నాశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టాను.

భోజనాలు పూర్తయ్యాక అందరం గదిలో

కూర్చున్నాం.'' 'ఏమిటి రాజమ్మ మూడీగా వుంది'' అన్నాను ప్రసన్నతో. '' పాట పాడమంటే చాలు, ఎక్కడలేని హుషారు వస్తది. నే నవ్విస్తానుండు.'' అని రాజమ్మ పక్కన చేరింది ప్రసన్న. ఆ అమ్మాయి ఏం పాడుతుందో వినాలని అందరికీ కుతూహలమే. రాజమ్మ కళ్ళుఎర్రగా ఎటో చూస్తూవుంది. ఎందుకంత అస్థిమితంగా వుందో. బహుశా సంసారంలో కలతలేమో' అనుకున్నా.

ఏదో ఆలోచించుకుంటూ తలూపుతూ కళ్ళు మూడుచుకున్న రామమ్మ హఠాత్తుగా గొంతు విప్పింది.

ఈ పూల బంధాలు
నన్నాపలేవయ్యా..
ఎల్లీపోనీ వయ్యో..
ఎన్నెల్లా రాజా..
నువ్వు కోరూకుంటే
నెల బాలుడో రాజ
సక్కన్నిసుక్కాలు
సందేళ కాస్తాయి
కోళ్ళ గూటిలోన
పిల్లి జొరబడతాది
గాజుల గంపలోన
రాళ్ళుబడతాయి
తల్లిలేనిజము
తల్లడిలి పోతారు
అరిసేతిలో ఊరు
అగ్గి పాలౌతాది

విషాదంగా మొదలైన పాట దుఃఖపు జీరతో సాగి వెక్కిళ్ళతో ఆగిపోయింది.


"ఏయ్ రాజమ్మా ఏంటా ఏడుపు ఊరుకో. నీకేమన్నా పిచ్చా! రంగనాథ్ వింటే బాధపడతాడు" ఓదార్చబోయింది ప్రసన్న.

ఆ అమ్మాయి దుఃఖం చూసి ఆగలేకపోయాను. దగ్గరగా వెళ్ళి "ఏంజరిగింది రాజమ్మా. ఎందుకింతబాధపడుతున్నావు?" అన్నాను అనునయంగా.

"ఇక్కడుండలేనక్కా. మా ఊరికి పోతాను. నాకీ కడుపొద్దు. నా సొంతానికి పిల్లలొద్దు" వెక్కుతూ అంది రాజమ్మ.

"ఏం అమ్మా... ఎందుకొద్దు, నిన్ను తను బాగా చూట్టంలేదా? ఊరికెందుకు పోవడం" అన్నాన్నేను.

"ఆ మాట పాపమక్కా, రాణోలె సూత్తడు నన్ను. ఈ సింహాసనాలు నా కొద్దు తల్లీ. నేనుమందిల కలిసి మంది కోసం బతికేటిదాన్ని. ఊరి కోసం బతికిన, ఊరిజనాన్ని ఎంటేసుకు తిరిగిన. కత్తికి జంకలేదు. అతికారానికి తలాయించలేదు.




అన్యాయం చూసి ఊరుకోలేదు. కాసుకి ఆశపడలేదు. అభిమానానికితలొంచేశానక్కా. అందరినీ అన్యాయం చేసి ఈడ సుకపడిపోతన్నా. అక్కడ జనంతల్లి లేని పిల్లల మాదిరైపోతారు.''

ప్రసన్న చెప్పింది. నిజామాబాద్ జిల్లాలో పుట్టిన రాజమ్మ జనం కోసం నాయకుల కెదురునిలిచి పోరాడిన వివరం. అక్షరం నేర్వని రాజమ్మ క్షణాల్లో పాటలు కట్టిపాడే ఆవేశం. ఎంత మంచి పిల్ల. అందువల్లనే పెద్దింటబ్బాయి ఏరి కోరి పెళ్ళిచేసుకున్నాడు. తల్లి కాబోతోంది.ఇక నుంచీ హాయిగా బ్రతుకుతుంది అనిపించింది నాకు.

"ఏదో పడినన్నాళ్ళూ పడ్డావు రాజమ్మా. నువ్వుండబట్టే ఇన్నాళ్ళు నీ వెనక తిరిగారు. ఇప్పుడు లేవు కనుక ఎవరో ముందు నిలబడతారు. వాళ్ళ సమస్యలు వాళ్ళు పరిష్కరించుకుంటారు. నీకు మాత్రం ఇల్లు, సంసారం, పిల్లలు కావొద్దా. అతనికీ నీ చరిత్ర తెలుసు కనుక వెళ్ళి చూసొస్తూ వుండు" అన్నా నేను అనునయంగా. నాలో రాజమ్మ పట్ల అంతులేని ప్రేమ సాగింది.

"వద్దక్కా, అట్లనకు. నా జనం నోరు లేని గోవులు. నన్ను చూసుకుని బతుకుతున్నారు. నేను మందితో కలిసి యాపై నల్లలేయించినా. కంక్రోడ్లేయించినా. వందమందికి ఇల్లు పట్టాలిప్పియించినా. ఇక ఏ దేవుడు జేత్తాడు? ఒక్కతిని అన్నం తినే బదులు మందితో గలిసి గెంజి తాగుదామనే అనుకున్నాననక్కా. పెళ్ళి జేసుకునిఈన కొండి పెట్టి, ఈన పక్కల బండి, బిడ్డల్నిగని.... సాకి పెద్దోన్ని జెయ్యడానికే నా బతుకంత గడపాలా, నాకొద్దమ్మో. నన్ను బోనివ్వండి. ఎటు గూడీ పోయేటి దాన్నే. నా రత్తం, పేణం, బతుకు, కూడూ,గుడ్డాలేని బక్కోళ్ళ కోసమే గాని సొంతానికి గాదు. నన్నాడకేపోనివ్వండి. నేనొట్టి ఆడదానిగా బతకలేను. నేను మణిసిని. నన్ను మణిసిగా బతకనీండి.''

మా కెవ్వరికీ నోట మాట రాలేదు.

"మధ్యలో రంగనాథ్‌కి అన్యాయం చేస్తావా? నీ మీదే ప్రాణం పెట్టుకొని అందర్నీ వదులుకున్నాడు" అంది ప్రసన్న.

"ఆయన మారాజు బిడ్డ. నేనాయనకు తగిన దాన్నికాదు. నే చెప్పిపోతా. ఒప్పించాకే పోతా" అంటూ లేచి వెళ్ళిపోయింది రాజమ్మ.

అతని మనసు, అతని డబ్బు, అతని తోడు, అతను, అతను.... అని అల్లాడి ఏడ్చి, పోట్లాడి, అతని నీడల్లా మసిలే మేమెక్కడ,..తానొక వ్యక్తిగా నిలబడి ఒక మార్గాన్వేషరచుకుని గమ్యంవైపు సాగే ఆమెక్కడ! అలా వెళ్తున్న ఆసన్నటి పొట్టిమనిషి నీడ మహోన్నతంగా మమ్మల్ని కమ్ముకుంది.

## వెర్రి వెయ్యి విధాలు!

వెర్రి వెయ్యి విధాలని మనవారు ఊరికే అన్నారా? ఈ లోకంలో ఎన్ని వెర్రులున్నాయో తెలుసుకుంటే 'అమ్మో' అనిపిస్తుంది. నికరాగ్వా అనే దేశంలో సిల్వా అనే తల్లి వుంది. ఆమె వయస్సు ఎంతో కాదు 65 సంవత్సరాలే! ఆమెకో కొడుకున్నాడు – 32 సంవత్సరాల పచెకో! ఆ సిల్వా ఈ పచెకోను పెళ్ళి చేసుకొంది! ఆ జాతిలో ఇటువంటివి మామూలే అనుకోవాలి! అక్కడాచారం అదేమో!

–డా॥ ద్వానా. శాస్త్రి